నమస్తే తెలంగాణ | DISTRICT SUPPLEMENT

మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్

ఆదివారం 26 నవంబర్ 2023
SUNDAY, NOVEMBER 26, 2023
MANCHERIAL
KUMURAM BHEEM ASIFABAD
పేజీలు PAGES : 12




ఖానాపూర్‌లో సీఎం కేసీఆర్ బహిరంగ సభ స్థలంలో ఏర్పాటు చేసిన టెంట్లు, కుర్చీలు




# 3 గంటల కరెంటొద్దు.. 10 హెచ్‌పీ మోటర్లొద్దు..

.. మధ్యపేజీలో



**కర్షకులపై కక్ష గట్టిన కాంగ్రెస్ పార్టీ నాయకులు**

- మళ్లీ గోస పడడానికి సిద్ధంగా లేమని రైతుల మండిపాటు
- హస్తం గుర్తుకు అవకాశమిస్తే షాక్ తగలడం ఖాయమని వెల్లడి

**'ఎద్దు, ఎవుసం తెల్వనోడు** మాట్లాడితే గిట్లనే ఉంటది. తలుండదు, తోకుండదు.. వరికి ఎన్ని నీళ్లు అవసరమో తెలుసా.. వాణిజ్య తోటలకు, కూరగాయలు పండించడానికి ఎన్ని నీళ్లు కావాలో చెప్పగలరా.. అందరూ అగ్రనేతలే కదా.. ఇందులో ఎవుసం జేసినోడు ఒక్కడంటే ఒక్కడు లేరు. వాళ్లు వీళ్లు చెబితే మైకుల ముందు మొత్తుకోవడం తప్ప.. లెక్కలతో సహా చెప్పగలరా.. గదే కేసీఆర్ అయితే.. ముందు చూపుతో అంచనా ఏసి రైతన్నకు మేలు జేసే ఆలోచన జేస్తడు. ఆయన ఆలోచన నుంచి పుట్టిందే 24 గంటల నిరంతర ఉచిత కరెంటు. దిగ్విజయంగా అమలు చేయడంతో రైతు రాజయ్యాడు. గిప్పుడేమో కాంగ్రెసోళ్లు సాగుకు మూడు గంటల కరెంటు సాలని, 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకొని నీరందించాలని చెబుతున్నరు. ఎవడైనా ఆలోచన ఉన్నోడు గీ మాటంటడా.. అందుకే కాంగ్రెసోళ్లు అవకాశం కోసం చూస్తున్నరు. వాళ్లు అధికారంలోకి వచ్చేది లేదు.. సచ్చేది లేదు.. మళ్లీ బీఆర్‌ఎస్సే హ్యాట్రిక్ సాధిస్తది.' అని రైతులు ముక్తకంఠంతో నినదిస్తున్నరు. గాలి మాటలకు ఆగం కామని, ఆలోచించి ఓటు సద్వినియోగం చేసుకుంటామని తెలుపుతున్నారు. *- మంచిర్యాల, నవంబర్ 25(నమస్తే తెలంగాణ ప్రతినిధి)*

## ఖానాపూర్‌కు ప్రగతి ప్రదాత

- నేడు సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ
- సిద్ధమైన హెలీప్యాడ్.. ఏర్పాట్లు పూర్తి
- పర్యవేక్షించిన అభ్యర్థి జాన్సన్ నాయక్, ఎమ్మెల్సీ విఠల్, సీనియర్ నాయకుడు రవీందర్‌రావు
- భారీ జన సమీకరణకు సన్నాహాలు

**ఎన్నికల ప్రచారంలో** భాగంగా ఆదివారం నిర్మల్ జిల్లా ఖానాపూర్ నియోజకవర్గానికి ప్రగతి ప్రదాత, సీఎం కేసీఆర్ రానున్న నేపథ్యంలో ప్రజాప్రతినిధులు, నాయకులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే హెలిప్యాడ్ సిద్ధం చేయగా, సభా వేదికను శరవేగంగా నిర్మిస్తు న్నారు. మధ్యాహ్నం 12 గంటలకు ముఖ్యమంత్రి చేరుకోనుండగా, భారీగా జనాన్ని సమీకరించి సభను విజయవంతం చేసే పనిలో నిమగ్నమయ్యారు. శనివారం బీఆర్‌ఎస్ అభ్యర్థి జాన్సన్ నాయక్, ఎమ్మెల్సీ దండె విఠల్, సీనియర్ నాయకుడు రవీందర్‌రావు ఏర్పాట్లను పరిశీలించారు. *- నిర్మల్, నవంబర్ 25(నమస్తే తెలంగాణ)*

..2లో

# ధరణి ఎత్తేస్తే విధ్వంసమే..

.. మధ్యపేజీలో

**పాత పద్ధతొస్తే పల్లెల్లో నిత్యం భూ తగాదాలే..**

- కాంగ్రెసోళ్ల భూమాత పోర్టల్ సంపాదించుకోవడానికేనా..
- సీఎం కేసీఆర్ తీసుకొచ్చిన ధరణే బాగుందంటున్న రైతులు

**కాంగ్రెసోళ్లు ధరణి పోర్టల్** స్థానంలో భూమాతను తీసుకొస్తమంటున్నరు. అదే జరిగితే.. వ్యవసాయం, రైతన్న బతుకులు ధ్వంసమవుతాయి. డిజిటల్ వ్యవస్థ రద్దవుతుంది కాబట్టి సర్కారు వద్ద భూములు, రైతులు, పంట విస్తీర్ణం, దిగుబడి వంటి వివరాలు ఉండవు. ఫలితంగా ఎన్ని కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలనే లెక్క తేలదు. చివరకు పంటను అమ్ముకోవాలంటే దళారుల చుట్టూ తిరగాల్సి వస్తది. అష్టకష్టాలు పడి పండించిన పంటలను మద్దతు ధరకు కాకుండా దళారులు ఎంతిస్తే అంత తీసుకోవాల్సి వస్తది. ఏ సమాచారం లేదన్న సాకుతో రైతుబంధు, రైతుబీమా అన్ని నిలిచిపోయే చాన్స్ ఉంది. ఇంకా, ఎరువులు, విత్తనాలు కూడా సకాలంలో సరఫరా కాకపోవడంతో అన్నదాతలు అవస్థలు పడాల్సి వస్తుంది. మళ్లీ క్యూలైన్లు, జాగారాలు, టిఫిన్లు పట్టుకెళ్లి దుకాణాల వద్దనే పాత పద్ధతిలో ఉండాల్సిన దుస్థితి నెలకొనే పరిస్థితి ఉంది. గెట్టు పంచాయితీలు, భూ తగాదాలు అని ఠాణాలు, కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తది. *- మంచిర్యాల, నవంబర్ 25(నమస్తే తెలంగాణ ప్రతినిధి)*

### ధరణిపోతే రైతుల బతుకులు ఆగమే



నెన్నెల, నవంబర్ 25 : ధరణి లేక ముందు ఎంత గోసపడ్డమో గా కాంగ్రెస్ నాయకులకు ఏం తెలుసు. ధరణి పోతే రైతుల బతుకులు ఆగమైనట్లే. అప్పుడు గట్లనే పట్వారీలతో నానా గోస పడ్డం. భూమి పట్టా చేసుకోవాలన్న పహాణీలో పేరు మారాలన్న అప్పు తెచ్చి డబ్బులిస్తేనే పనయ్యేది. ఇప్పుడు మళ్లా అట్లనే రైతులను గోస పెట్టలని కాంగ్రెసో ళ్లు చూస్తున్నరు. పట్వారీ రాజ్యం తీసుకొస్తే కాంగ్రెసోళ్లు ఆఫీసులనే దుకాణం పెడ్తరు. దేవునోలే కేసీఆర్ సారు ధరణి పెట్టి ఎక్కడి రైతులకు అక్కడే పట్టాలు అయ్యేటట్లు చేసిండు. ఇంతకంటే మంచి చేసినోడు ఎక్కడున్నడో కాంగ్రెసోళ్లు చూపెట్టాలి. రైతులు పడుతున్న ఇబ్బందులను చూసే కదా సీఎం సార్ రైతులకు ధరణి పెట్టి అండగా ఉంటుండు. భూముల కోసం రోజు గొడవలు పెట్టుకుని పోలీస్ స్టేషన్‌ల చుట్టూ తిరగాల్సి వచ్చేది. అలా జరగవద్దనే అన్ని భూముల వివరాలు ధరణి పోర్టల్‌లో పెట్టిండు. మంచి చేసిన సీఎం కేసీఆర్ వెంటే నడుస్తం.

*- అద్దరపెల్లి పోషయ్య, రైతు, జంగాల్‌పేట*

### మూడు గంటలతో మూడు గుంటలు కూడా తడువయి



కోటపల్లి, నవంబర్ 25 : కాంగ్రెస్ ఎవుసానికి మూడు గంటల కరెంట్ ఇస్తా అని చెప్తుంది. ఆ మూడు గంటల కరెంట్‌తో మూడు గుంటల భూమి కూడా తడువయి. కాంగ్రెస్ పాలనలో ఎవుసానికి కరెంట్ ఎట్ల ఉంటదో కళ్లారా చూసినం. మళ్లీ చేజేతుల కాంగ్రెస్‌కు అధికారం ఇచ్చి పంటలు పండక పస్తులుండుడు మాతోని కాదు. పైగా 10 హెచ్‌పీ మోటర్ వాడమని ఉచిత సలహాలు ఇస్తున్నరు. ఇదేమన్న తలకాయ ఉన్నోడు చేప్పే మాటనేనా.. మా రైతన్నలకు కేసీఆర్ సార్ వచ్చినంకనే మంచి చేసిండు. మాకు ఏం చేయాలో కేసీఆర్ సార్‌కు అన్ని తెలుసూ.. అవే చేస్తున్నడు.. మా రైతులను ఇబ్బందులు పెట్టాలి అని చూస్తున్న కాంగ్రెస్‌ను ఖతం చేస్తం. రైతును రాజును చేస్తున్న కేసీఆర్ సార్‌కే మేం జై కొడతం.

*- కామ రాజన్న, కోటపల్లి*

# 'రైతుబంధు'కు లైన్ క్లియర్

**అనుమతిచ్చిన కేంద్ర ఎన్నికల సంఘం**

- మంగళ వారం నుంచి రైతుల ఖాతాల్లో జమ
- కాంగ్రెస్ కుట్రలు పటాపంచలు
- బీఆర్‌ఎస్ పార్టీకి జై కొడుతున్న రైతన్నలు
- 11 విడుతల్లో అందిన సాయం రూ.8,349 కోట్లు
- ఆరు లక్షల పైచిలుకు మందికి చేకూరనున్న లబ్ధి

పదకొండు విడుతల్లో రైతుబంధు సాయం..

| | వానాకాలం(రూ.కోట్లు) | యాసంగి(రూ.కోట్లు) |
|---|---|---|
| మంచిర్యాల | 920 | 709.65 |
| నిర్మల్ | 1,226.16 | 954.14 |
| ఆసిఫాబాద్ | 983.76 | 804.48 |
| ఆదిలాబాద్ | 1,466.22 | 1,284.62 |
| మొత్తం | 4,596.14 | 3,752.89 |

**రైతుబంధును ఆపాలని** కాంగ్రెస్ పార్టీ చేసిన కుట్రలు పటాపంచలయ్యాయి. పెట్టుబడి సాయాన్ని యథాతథంగా అమలు చేయడానికి ఎన్నికల కమిషన్ అనుమతి ఇచ్చింది. అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా ఈనెల 29, 30 తేదీల్లో పంపిణీ చేయద్దని ఆంక్షలు విధించింది. ఆదివారం, సోమవారం ప్రభుత్వ సెలవులు ఉన్నందున మంగళవారం నుంచి డబ్బులు రైతుల ఖాతాల్లో పడనున్నాయి. తొలిరోజు ఎకరం లోపు భూమి ఉన్న రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయం పడనుంది. ఎన్నికల సంఘంతో కొట్లాడి పెట్టుబడి సాయం అందేలా చూసిన బీఆర్‌ఎస్‌కు జై కొడుతున్నారు. ఇప్పటి వరకు 11 విడుతలుగా 6.23 లక్షల మంది రైతులకు రూ.8.349.03 కోట్ల రైతుబంధు సాయం అందింది. ఈ దఫా రానున్న 12వ విడుతలో ఉమ్మడి జిల్లాలో 6 లక్షల పైచిలుకు మందికి లబ్ధి చేకూరనుంది. *- మంచిర్యాల, నవంబర్ 25(నమస్తే తెలంగాణ ప్రతినిధి)*